# కట్నం

స్టాఫ్ రూమ్‌లో వెంకటేశ్వర్లు అడుగు పెడుతుండగా ఎరగనట్లుగా శివశాస్త్రి చమత్కారం పోయాడు.

నాటకం ఫక్కీలో వాచికాన్ని మాత్రమే ఆశ్రయించి, "వెనకటికి ప్రవరాఖ్యుడికి మగువ పొలపు దెలిపే, ఘనసార సాంద్రవీటీగంధం ముకుపుటాలకు సోకినట్లుగా, ఎక్కడి దబ్బా యీ సెంటువాసన—"

అందరి ముఖాలూ వులిక్కిపడ్డాయి.

స్వరాజ్యలక్ష్మి కొంచెం ముఖం చిట్లించింది కనుక, శంకర్రావుకి ఆ జోక్ నచ్చలేదన్న ముఖం పెట్టాడు, శివశాస్త్రి. 'ఓహో కొత్త పెళ్ళికొడుకొచ్చెన్, విశేషమ్ము లేవినవచ్చున్! అన్న దసరా పద్యాల బాణీ, అక్కడున్న స్వరాజ్యలక్ష్మి అనబడే పూబోణి, కోపాన్ని కాస్తా పోగొట్టింది.

"పెళ్ళి కళ చూడండి."

"సిగ్గుపడతా వెందుకోయ్,"

"సిగ్గుపడుతుంటే కొత్త కళ వచ్చిందే"

ఇత్యాదికులాసా ప్రశ్నలకు, వెంకటేశ్వర్లు ముభావంగా వుండిపోయినాడు. గాంభీర్యాన్ని, బిడియాన్నీ, మధ్య గీతగీసి వేరుచేస్తూ, ఎటో చూస్తూ,

ఇంతకూ కట్నమెంతండోయ్, స్టాఫ్ మెంబర్సందరూ గారడీవాడు కళ్ళముందే మొలిపించిన మామిడిమొక్క, కాయా, పదరు ముక్కా, చూస్తూ తింటున్న ఆశ్చర్యంతో, ఆ వేపుచూశారు.

స్వరాజ్యలక్ష్మి పళ్ళు బిగబట్టి నవ్వింది.

ఆ నవ్వు వెనక వేళాకోళం వుంది. వ్యంగ్యంవుంది.

ఇంకా ఏమంది ?

"ఓహో చెప్పకూడదు కాబోలు

లోపాయికారీగా పుచ్చుకున్నది ఎన్నివేలు."

ఆమె తెలివికక్కడున్న ఆడా, మగా, స్టాఫ్ మెంబర్ల కిలకిలలు, కిచకిచలు.

ఆమె మాటల్లో ఎత్తి పొడుపూ, వెక్కిరింపూ.

వెంకటేశ్వర్లు ఉక్కిరి బిక్కిరైనాడు.

చాలా చిన్నతనమైంది. సహోధ్యాయులు స్వరాజ్యలక్ష్మిని మెచ్చుకునేదేబె చూపులు చూడటం చికాకనిపించింది. ఆమె అట్లా తనగొప్పను ప్రదర్శించుకునేట్లు మాట్లాడటం కొందరికి ఇష్టంలేదు. చాలా మందికి ఇష్టమేనని వాళ్ళ వాలకం చెపుతున్నది.

ఆమె అభ్యుదయ భావాల ప్రతినిధి

కట్న నిరోధక సంఘం అధ్యక్షురాలు

పట్నం దాకా పేరు పాకినముద్దరాలు.

సాంఘిక సేవాతత్పరత్వంలో ఆమె కామేసాటి ?

పాపం పూర్ వెంకటేశ్వర్ల సగా వెక్కిరించటానికేపాటి ? కాలేజీ కమిటీ ఛైర్మన్ గారిమేనగోడలు కాబట్టి ఆమె మాటల్లో హాస్యంతొణికిసలాడుతూవుంటుంది. ఎమ్, ఏ లు పాసై వచ్చినా ఏబ్రాసి తనం పోని మగరాయుళ్ళు కొందరికి. ఓర చూపుపొరపాటున తమ మీద ప్రసరించ వచ్చునని ఎదురుగా కూచుంటారు వాళ్ళు. ఆమె మొహం ఎదురుగా కనపడకపోతే, ఈ ఊళ్ళో కాలేజీ స్థాపించి, తనను తాను ఉద్ధరించుకున్నది కాక, పరాయివాళ్ళనూ వుద్ధరించింది చూశావా ? అంటాడు శివశాస్త్రి. కాని ఆమె కనపడగానే నక్క వినయాలూ, నంగిమాటలూ. ఆమె మాటల్లో అంతా హాస్యమే. వేము చేదు, వెన్నెముక లేనివాళ్ళకు వెకిలితనం, పోదు. పాముకు మాత్రమే రెండు నాలుకలుంటాయని వాళ్ళకు తెలీదు. వెనక వెక్కిరిస్తారు. ముందు ప్రియంగా మాట్లాడుతారు. వందిమాగధులూ, భట్రాజులూ, స్తోత్ర పాఠకులూ ఇప్పుడూ వున్నారు. డబ్బున్న వాళ్ళనూ, అధికారం వున్నవాళ్ళనూ యీ వెధవలే పాడు చేస్తున్నారు.

శివశాస్త్రి మహబాగా సెలవిచ్చారన్నట్లు చూశాడు.

శంకర్రావు చప్పట్లు చరచబోయి మానుకున్నాడు.

జోరుగా, హుసారుగా స్వరాజ్యలక్ష్మి ముదలకించింది.

మేష్టారూ, అన్నది మంద్రస్థాయిలో, మంత్రి పర్యుని ఠీవితో.

"చదువుకున్నవాళ్ళే ఇట్లా ప్రవర్తిస్తే ఎలా సంఘం"

వెంకటేశ్వర్లుకు చురుక్కుమంది.

"ఎందుకు మీరు చిన్నబుచ్చుకోవటం. నేనేం కానిమాట అనలేదే. ఎవరో అనుకుంటుండగా విన్నాను. అంతకు పూర్వం, కట్నమసలు తీసుకోననీ, పిల్ల నచ్చితే చాలనీ అనేవారుగా, ఇప్పుడు పిల్లవిషయంలో కాక, కట్నం విషయంలో శ్రద్ధ ఎక్కువైనట్లుందే."

వెంకటేశ్వర్లు మాట్లాడక పోవటం, అతడి ఆప్తమిత్రులకు కష్టమనిపించింది. చాలా చురుకుగాను, వాడిగానూ, తిప్పికొట్టటంలో వెంకటేశ్వర్లు అత్యంత ప్రతిభాశాలి. అతడు మాట్లాడుతూవుంటే, వినే వాళ్ళకు చాలా ఆసక్తి కలుగుతూవుంటుంది. అందరూ అదొక ఆకర్షణతో వింటారతడి మాటలు. ఎవరి విషయాల్లోనూ అనవసరంగా ఎప్పుడూ జోక్యం చేసుకోడు. మితభాషి. స్టాఫ్‌రూమ్‌లో, స్వరాజ్యలక్ష్మి ఇట్లా మాట్లాడటం, వెంకటేశ్వర్ల స్నేహితుల కిష్టంలేదు. కమిటీ ఛైర్మన్ గారి మేనగోడలైనా, వారంరోజులు శెలవు పెట్టి, పెళ్ళి చేసుకుని వచ్చిన వెంకటేశ్వర్లను అంతేనా అభినందించటం అని వాళ్ళ గుర్రు. అయితే శంకర్రావూ, శివశాస్త్రి లాంటివాళ్ళు, ఆమె పెదవులపైన ఏ శబ్దం వచ్చినా, హాస్యరసంచిలుకుతున్నట్లే ఎంచుకుని, ముదిరి పోయిన అనపకాయ మొహాలతో, ఆమెను సమర్థిస్తారు.

స్వరాజ్య లక్ష్మిని రెండు మూడు సార్లు కీలెరిగి వాతపెట్టమన్నట్లు, వెంకటేశ్వర్లు చీవాట్లు పెట్టాడు. అతిశయం ప్రకటించుకుంటూవుంటే. సగం అదీ కోపం కావచ్చుఆమెకు. స్వరాజ్యలక్ష్మి ఇన్ని మాటలు మాట్లాడినా వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

స్వరాజ్యలక్ష్మికి దీంతోమరీ ఉత్సాహంవచ్చేసింది. ఆమె పెత్తండ్రిగారి బాపమరిది తోడల్లుడుగారో లేక పింతల్లి ఆడబడుచు బావ గారి మూడో తమ్ముడో, ఆ రోజుల్లో స్వరాజ్యాన్ని సంపాదించాల్సిన ఆవశ్యకతను గూర్చి అనర్గళంగా ఉపన్యసించి గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించి, ప్రస్తుతం గొప్పరాజకీయ నాయకుడుగా వుంటున్నారుట. తన పేరు ఆయన సలహా ఫలితమేనంటూ, స్వరాజ్యలక్ష్మి ఎప్పుడూ చెపుతూ వుంటుంది.

స్వరాజ్యం రావటానికి ఐదేళ్ళు ముందు పుట్టిందామె. అందువల్ల స్వరాజ్యం తన వల్లనే వచ్చిందని ఆమె గట్టి నమ్మకం. అందుకనే కాలేజీ ఉద్యోగాన్నికూడా ఆమె 'స్వరాజ్య'మనే అనుకుంటూవుంటుంది. మేనమామ స్థానిక నాయక శిఖామణి. ఊళ్ళో అంతా చందాలు పోగు చేసి గొప్ప విద్యావేత్తగా ప్రసిద్ధి కెక్కాడు. ఆమె కూడా యథాశక్తి సంఘసేవ చేస్తూ విద్యావేత్తగా చెలామణీ అవుతున్నది.

"ఇవాళ యువకులలో ఇదొక దురభ్యాసమైపోయింది. ముందు గొప్ప గొప్పగా కబుర్లు చెప్పటం. తర్వాత చప్పగా జారిపోవటం. సంప్రదాయాలను, కట్టుబాట్లను, పాతవ్యవస్థను, ఎదిరించాలని, లేదా నిరసించినట్లు కనపడాలని లోపలి వుబలాటం, కాస్త ఎర్రగా, బుర్రగా వున్న పిల్లనూ, వాళ్ళ నాన్న వుద్యోగాన్నీ డబ్బునూ, చూసి ప్రేమించా లనీ, ప్రేమించాననీ, పెళ్ళాడలనీ, తాపత్రయపడటం, తీరా రంగంలోకి ప్రవేశించాక, చదువుకున్న పిల్లలంటే భయంకొందరికి. డబ్బులేకపోతే ప్రేమించలేరు కొందరు, కట్నంలేకపోతే పెళ్ళాడలేరు మరికొందరు, వేదికలెక్కి ఉపన్యాసాలు చెప్పమనండీ, ఇష్టాగోష్ఠులలో అభిప్రాయాలు చెప్పమనండీ, కులాసాగా కాలక్షేపంగా ఆడపిల్లలతో తిరగమనండీ, తమ కంటే ప్రజ్ఞావంతులు లేనట్లు ప్రవర్తిస్తారు."

స్వరాజ్యలక్ష్మి ఉపన్యాసం ముగియగానే, చప్పట్లు కొట్టరేం అన్నట్లుగా, శివశాస్త్రి వైపూ, శంకర్రావు వైపు చిరునవ్వు కళ్ళతో చూసింది. తమ జన్మ ధన్యమైపోయినట్లు పులకించి పోయారు వాళ్ళు.

వెంకటేశ్వర్లు ఇప్పుడూ మాట్లాడలేదు. అతడి స్నేహితులు మాత్రం బాధ పడిపోయినారు.

'ఇంతకూ ఎంత మొత్తమో చెప్పనేలేదు' అంది స్వరాజ్యలక్ష్మిని ఉత్సాహపరుస్తూ ఆవిడ చెలికత్తె వొర్తు.

"నాలుగు వేలు" అన్నాడు వెంకటేశ్వర్లు అప్పటికి పెదవికదిల్చి స్వరాజ్యలక్ష్మి కనుబోమలు ఎగరేసి 'నాలుగు వేలే' అమ్మబాబో అంది చూపులతో.

"సంఘం యీ విధంగా జడత్వంలోకి పోతున్నదంటే, చదువు కున్నవాళ్ళు కూడా దురాచారాలను, ఎదిరించలేక పోవటం, లేకపోగా, తామూ దురాచారాల్లోనే కొట్టుకపోవటం, ఇంతకన్నా దురాచారంఏముంది ?

స్వరాజ్యలక్ష్మి మళ్ళీ ఉత్సాహోద్రేకాలతో ఉపన్యాసం సాగించేదే కాని, ఇంతలో 'బెల్' వినపడింది గణగణమంటూ చాలా మందికి క్లాసులున్నాయి. వెళ్ళక తప్పదు. భావిభారత దేశాన్ని తీర్చిదిద్దవలసిన బుద్ధిమంతులందరూ, ఆవులిస్తూలేచి, విసుక్కుంటూ ఎవరిక్లాసులకు వాళ్ళు వెళ్ళిపోయారు. స్వరాజ్యలక్ష్మికి క్లాసు లేదు లాగుంది. చప్పబడి పోయింది. వినేవాళ్ళు లేరాయె. ఉపన్యాసం చెప్పేందుకు. ఓడిపోయిన మంత్రిగారికిలా విరక్తి కలిగింది.

అదృష్టం. వెంకటేశ్వర్లుకూ క్లాసున్నట్టులేదు. లేచి స్వరాజ్య లక్ష్మికి ఎదురుగా వెళ్ళికూచున్నాడు.

ఆవిడకొంచెం తెల్లబోయినా తమాయించుకుని చూసింది. వెంకటేశ్వర్లు సర్దుకుని కూచుని "ఏమండీ స్వరాజ్యలక్ష్మిగారూ నేనొక్కటడుగుతాను కానీ, కోపం లేకుండానూ, అబద్ధాలు కాకుండానూ చెప్పండి" అన్నాడు.

ఆమె చెపుతానన్నది.

"ఈ ఊళ్ళో మీకు ఎన్నిళ్ళున్నాయి ?"

"మూడిళ్ళు."

"మీ తమ్ముడిప్పుడేం చేస్తున్నాడండీ. నా క్లాస్ మేట్‌గా వుండేవాడు ఇంటర్‌లో. తరువాత బి. ఎస్‌సి. చదివాడు గదూ. పాసైనాడా ? తప్పాడా ? తప్పితే ఎన్నిమాట్లు తప్పాడు."

"ఏమిటో మీ ప్రశ్నలన్నీ వింతగావుంటున్నాయి. అదీ కాక ఇవన్నీవ్యక్తి గత విషయాలు కదా"

"అవుననుకోండి !"

"అట్లా అడగటమూ తెలుసుకోపటమూ, మర్యాద కాదనిమీకు మాత్రం తెలీదా"

"మీకు అవమానం కలిగించాలని కానీ, న్యూన పరచాలని కానీ, ఎంత మాత్రం నా వుద్దేశంకాదు. నే నెందుకివన్నీ అడుగుతున్నానో మీకు తీరికగా తెలియ చెబుతాను. ముందు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి"

.... .... .... .... ....

"మీ తమ్ముడిప్పుడేం చేస్తున్నాడు."

"మొన్నీ మధ్యనే మణిపాల్ నుండి ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని వచ్చి కంట్రాక్టులు చేస్తున్నాడు."

"ఇంజనీరింగ్‌లో మీ తమ్ముడికి సీటెట్లా వచ్చింది?"

"ఈ ప్రశ్న చాలా అనుచితంగా వుంది. నేను సమాధానం చెప్పను."

దేశ భద్రత దృష్ట్యా యీ ప్రశ్నకు సమాధానం చెప్పకూడదంటున్న మంత్రిగారి ధోరణిలో అన్నదామె.

"అయితే నేనే చెప్తాను వినండి. నాకు తెలియకపోతేగా, మీ నోటి వెంటే చెప్పించాలని నా అభిలాష. మీరు నా కోర్కెను మన్నించలేదు. కంట్రాక్టులెందుకు చేస్తున్నాడు. మీరు తలుచుకుంటే ఉద్యోగం రాకపోయిందా? అయినా కంట్రాక్టులుచేస్తే లక్షలు సంపాదించవచ్చును"

ఇవన్నీ వ్యక్తిగత విషయాలని చెప్పానుగా అన్నది స్వరాజ్యలక్ష్మి కనుబొమలు ఎగరేస్తూ.

"పోనీ యీ ప్రశ్నకు సమాధానం చెప్పండి. నాకన్నా మీ తమ్ముడు తెలివైనవాడా?"

"ఇక్కడ మన కాలేజీలో, ఆ మాట కొస్తే మన ఊళ్ళో, ఇంకా మాట్లాడితే మనదేశంలో మీ కన్నా తెలివైనవాళ్ళు లేరని మీ అభిప్రాయం లాగున్నది."

"మన కాలేజీ సంబంధించినంత మటుకు, నా అభిప్రాయమేకాదు. అది నిజంకూడా. సరే ఇప్పుడావిషయం దేనికి లెండి"

"మీకు అతిశయం"

"ఇప్పుడావిషయం ఎత్తవద్దు. మీ చెల్లెలికి నాలుగేళ్ళనుండీ పెళ్ళి చెయ్యాలని ప్రయత్నం చేస్తూ ఎన్నో సంబంధాలు చూస్తున్నారు కదూ"

"అవును, అదేమన్నా అపచారమా?"

"కట్నం ఎంత ఇస్తామంటున్నారు?"

'నాకు ఇష్టంలేదు. రోజూ నేను కట్నం ఇవ్వొద్దని వాదిస్తూనే వున్నాను.'

'నాకు తెలుసులెండి. లోగుట్టు. ఇరవై వేలు ఇస్తామని మీరు రాయబారాలు పంపించటం తెలుసునాకు'

స్వరాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

'ఏమండీ. నాలుగేళ్ళనుంచీ నన్ను మీరెరుగుదురు గదా. నేను మంచి సంబంధంకానా'

స్వరాజ్యలక్ష్మి నవ్వింది.

'మీరు వచ్చి అడిగితే నేను చేసుకునే వాణ్ణోకాదో, అదట్లా వుంచండి. నేను యూనివర్శిటీ ఫస్ట్ వచ్చానుకదా. నాలుగేళ్ళనుండీ ఉద్యోగం చేస్తున్నాను కదా. అందమైన వాణ్ణని కూడా అనుకుంటూ వున్నాను. మీ చెల్లెల్ని నా కిస్తామని ఎందుకనలేదు. మానాన్న మీ నాన్నగారిలాగా మూడిళ్ళు కట్టక పోవటం, దొంగవ్యాపారం చేయకపోవటం, బాంక్ ఎకౌంట్లు లేక పోవటం, ఇవేగా కారణాలు. మా నాన్నగారు అబద్ధాలాడలేదు. లైసెన్సులు సంపాదించలేదు. అంతే కదా".

స్వరాజ్యలక్ష్మికి చాలా కోపం వచ్చింది.

'ఇవన్నీ చాలా వ్యక్తిగతమైన విషయాలు. ఇట్లా మీరెందుకు మాట్లాడుతున్నారో నా కర్థం కావటం లేదు. కనీసమర్యాదలు కూడా విస్మరిస్తున్నారు మీరు.'

'కోపం తెచ్చుకోకండి. కట్నం తీసుకోవటం, తీసుకోకపోవటం, వ్యక్తిగత సమస్యకాదా ? వ్యక్తులు దుర్మార్గంగా ప్రవర్తించటం, నీచంగా డబ్బు సంపాదించటం, సాంఘిక సమస్యకాదా !

మా నాన్నగారు అబద్ధాలాడటం, నీచంగా డబ్బు సంపాదించలేక పోవటంవల్లనే కదా, పిల్లలను పోషించుకోవటం, చదువులు చెప్పించటం పెళ్ళిళ్ళు చేయటం కష్టమైపోయింది. రేపు నా భార్యకు మీ అందరిలానే మంచిచీర కట్టుకుందామనీ, మెళ్ళోవొక్కవరసైనా ఏదో వేసుకుందా మనీ, వుండదా. నా చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ చదువుకుని పెద్దవాళ్ళుకావద్దా, మీరు ఊళ్ళోని దొంగవెధవల నందరినీ పిలిచి, పెద్దపెద్ద విందులు చేస్తారు. ఏదో మిషపెట్టుకుని, నా పెళ్ళికి నలుగురినీ పిలిచి కాస్త భోజనం పెడదామని మావాళ్ళనుకోకూడదా. ఎక్కడిది డబ్బు? అసలు మీరు ఉద్యోగం చెయ్యటం కన్నా సాంఘిక దురన్యాయం వుందా ? మీరు ఉద్యోగం చేయకపోతే, నిజంగా అక్కరున్నవాళ్ళింకోరు బ్రతికే వాళ్ళు కదా. కట్నం తీసుకోవటం ఏం తప్పుకాదు, యీసమాజంలో, కట్నం కొరకే పెళ్ళిచేసుకోకూడదు. అది పూర్తిగా వ్యక్తిగతమైన సమస్య మీరంతా పెద్ద ఇళ్ళు కట్టుకోవాలి, కార్లలో తిరగాలి, తాగాలి, సంఘ సంస్కారం కూడా మీ పనేనా- ఇద్దరుపిల్లలున్నారుకదా మీకు, ఇంకా యీ షోకులెందుకండీ, పవిత్రమైన బాధ్యతను నిర్వర్తించవలసిన విద్యాలయానికి ఇంత షోకెందుకో !? మా ఆవిడకు కాస్త పెద్ద చీర కట్టుకుందామంటే, నలుగురున్న కుటుంబంలో కట్నం తీసుకోవాల్సిందే. మాకే నీతులు, త్యాగాలూ, సింపిల్‌గా బతకటం. మీకేంవద్దు, ఆడ

పిల్లకు కుడా తండ్రి ఆస్తిలో హక్కు కావాలని పోట్లాడరాదూ. అప్పుడు కట్నం తీసుకుంటే తప్పేమిటి? నాకు నాలుగువేలు కట్నం ఇచ్చినా, మా ఆవిడ అదృష్టవంతురాలే, మంచివాణ్ణి పెళ్ళి చేసుకుంటున్నందుకు యీ సంఘంలో జరిమానా. అనుకోనీవాళ్ళను"

'జరిమానా ఏం. మీధర అంతఅనరాదూ'

,అయితే మీ ధర ఎంత? సున్నా. మనుషులకు సంస్కారం, మృదువైన హృదయం కాక, ఇతరమైనవన్నీ యోగ్యతలా'

"ఇవన్నీ నీతులు. మీకు డబ్బున్న వాళ్ళంటే ఈర్ష్య"

'మీకు డబ్బులేని వాళ్ళంటే నిరసన, చులకన, డబ్బుకోసం నానా గడ్డీ కరుస్తారు, అదంతా ప్రయోజకత్వం అనుకుంటారు. అది చాలా తప్పు. మీ తమ్ముడు నాలుగు సార్లో ఐదుసార్లో బి. ఎస్సి తప్పి పూర్తి చేసుకోలేకపోతే, ఎనిమిదివేలో తొమ్మిదివేలో డొనేషన్ కట్టి ఇంజనీర్ని చేశారు. ఇంతకన్నా దేశద్రోహం ఇంకోటి లేదు. ఒక్క ఇల్లు చాలక మూడిళ్ళెందుకు మీకు. మీకింతడబ్బెందుకు. అన్ని అర్హతలుండి కూడా డబ్బులేని వాళ్ళు బాధపడుతూవుంటే, మీరు మీ తమ్ముడికి డొనేషన్ కట్టాలి. ముఫ్ఫైవేలో, పాతికవేలో, పెట్టి ఎవణ్ణో కొని, మీ చెల్లెల్ని అంటకట్టాలి. మీకన్నా క్వాలిఫికేషన్స్ వున్నవాళ్ళు ఎంతమంది వచ్చారు మీకిచ్చిన ఉద్యోగానికి. ఫస్ట్‌క్లాస్ వాళ్ళనందరినీ ఇంటికి పంపించి మీకు ఉద్యోగం ఇవ్వటమేమిటి! ఇంతకన్నా పాపం. ఇంతకన్నా అన్యాయం, ఇంతకన్నా అక్రమం. ఇంకోటి ఎక్కడుండేను."

స్వరాజ్యలక్ష్మి ముఖం జేవురించింది.

"మీరివాళ నాకు చాలా నొప్పి కలగజేస్తున్నారు."

'మీరిందాక నలుగురిలో నన్ను నొప్పించలేదా. నేనూ నలుగురిలో
మిమ్మల్ని ఆక్షేపిద్దామనుకున్నాను. కాని సభ్యతకాదని వూరుకున్నాను.
మీకామాత్రం సభ్యతకూడా లేకుండాపోయింది. లోకంలో అనర్థాలన్ని
టికీ మీరే అంటే, అక్రమంగా, కావలసినదానికన్నా ఎక్కువ డబ్బు
సంపాదించేవాళ్ళే కారణం, మీరు చేరుతున్నారు కనుక దేవాలయాలు
చెడిపోతున్నాయి. దేవుడూ దోషి అయిపోతున్నాడు. ఇంట్లో నలుగు
రన్నదమ్ములుంటే నలుగురూ సుఖంగానూ, తృప్తిగానూ బ్రతికితే తప్ప,
తల్లిదండ్రులకు సుఖశాంతులుండనట్లే, సంఘంలో కూడా సమానావ
కాశాలూ, న్యాయమూ వుంటే తప్ప, ఆ సంఘం ఉన్నతిపొందినట్లుకాదు.
కలతలు తప్పవు. కార్పణ్యాలు తప్పవు. కలహాలు తప్పవు. నేను ఉప
న్యాసం చెపుతున్నాననుకుంటే అది మీ కర్మ. ఆలోచించండి. ఆహార
పదార్థాలలో కల్తీ కలిపేవాళ్ళూ, తాగుబోతులూ, రౌడీల రాజకీయాలూ,
వున్న సంఘంలో, కట్నం తీసుకోవటం, పరస్పర ఆర్థిక వినయమూ,
సర్దుబాటు ఎందుకుకాదు! డాక్టర్ మూడు రూపాయలకు గడ్డితిని తప్పుడు
సర్టిఫికేట్ ఇవ్వొచ్చా. ఇంజనీర్ కూలిపోయే వంతెనలు కట్టవచ్చునా!
ఇది సంఘమా, స్మశానమా? ఒక చిన్నకథ చెపుతాను. వినండి. ఎనిమి
దేళ్ళ క్రితం ముచ్చట. సెంటర్‌లో స్వరాజ్య మెడికల్ స్టోర్ మీదేకదా—
ఓసారి మా చిన్న తమ్ముడికి పాలడబ్బా కావలసివచ్చి. ఊరంతాతిరిగాను:
ఎక్కడా దొరకలేదు. మీషాపు దగ్గరకూ వచ్చాను. ప్రాధేయపడి
వొక్క టిన్ ఇప్పించమని అడిగాను. పహపు కూడా వచ్చింది. ఏ మీలోణ
క్కుండా లేదని చెప్పేశారు ఆయన ఎవరో— మీ అన్నగారో, బావగారో
పార్టనరో, ఎవరైతేనేం! నేను ఎక్కువడబ్బు అంటే బ్లాక్ మార్కెట్
ఖరీదు, ఇవ్వాననో, ఇవ్వలేననో వాళ్ళ అనుమానం. ఎక్కడా దొరక
లేదు నాకు ఆవాళ ఊరంతా తిరిగినా! ఇంటికి వొట్టి చేతుల్తో వెళ్ళాను.
పంచదారనీళ్ళు బలవంతాన కాళ్ళమీద వేసుకుని చెంచాతో పోస్తున్న మా

అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూవుంటే నాకడుపు తరుక్కుపోయింది. మా ఇంటి పక్కనే వోభాగంలో తాసీల్దారుగారుండేవారు. ఆ సాయంకాలం మీ కొట్టునుండే, అవే పాల డబ్బాలు, ఆయన రెండు పట్టుకొచ్చాడు. దయతలచి వాళ్ళు కాస్త ఇస్తే నాలుగు రోజులు గడిచాయి. మొన్నీమధ్య కూడా ఇలాంటిదే సంఘటన జరిగింది. పురిటికి తీసుకుని వచ్చిన మాఅక్కయ్యపాపాయికి ఊరంతా తిరిగినా, ఆపాలపొడి దొరకనే లేదు. పసిపిల్లల పాల డబ్బాలు, నోరులేని ఆ పిల్లలు, చిన్నపొట్టకు ఆకలైతే ఎంత ఏడుస్తారో తెలీని పాపులు, దొంగనిల్వచేసి, ఎక్కువ ధరకు, ఎక్కువడబ్బున్న వాళ్ళకు, పర్మిట్లూ, లైసెన్సులూ, ఇప్పించగల అధికారం వున్నవాళ్ళకు, కక్కుర్తికుక్కకూడు తినేవాళ్ళకు, అమ్ముకునీ, మెహర్బానీగా కానుకలుగా, ఇచ్చి, ప్రయోజకులై పోతున్న యీ కుళ్ళు సంఘంలో, మురికి మనుషుల మధ్య, కట్నం తీసుకుని పెళ్ళి చేసుకోవటం, చేయరాని దోషమా ? పాపమా ?

జూదగాళ్ళు జూదగాళ్ళతోనూ, పాపులు పాపులతోనూ, దొంగలు దొంగలను చేరినట్లు, మీరూ మీరూ అంతా ఏకమై సంఘాన్ని నాశనం చేస్తున్నారు. డబ్బున్న వెధవనాకు పిల్లనిచ్చేందుకు రాడు. సిఫార్సులేని వాడికి ఉద్యోగం దొరకదు. ప్రాపకం లేకపోతే కాలేజీలో సీటుకూడా దొరకదు పైన సంఘం మారిపోయిందనీ, కులం, మతం, చెరిగిపోతున్నాయని ఉపన్యాసాలూ.

ఈ సారి ఇంకో ఉపన్యాసం చెపుతాను వెండికులం గూర్చి, సంఘంలో రావాల్సిన మార్పులు గూర్చి. ఇప్పుడు డబ్బున్నవాళ్ళు, లేనివాళ్ళు, రెండు కులాలు లేవా ? అధికారం వున్నవాళ్ళు, లేనివాళ్ళు, వర్గాలుకావా ? పాపం మీరు నా పైన కోపంతో మండిపోతున్నారు. నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తే బావుంటుందని మీ మామయ్యగారితో చెపుతారు.

కాని నన్ను కాలేజీ నుంచి పంపితే పిల్లలు సమ్మెచేస్తారు. నేనంటే మీకు భయం. మీకు సంఘాన్ని గూర్చి, సంస్కరణను గూర్చి మాట్లాడే యోగ్యతలేదు. ఎప్పుడూ మాట్లాడకండి. టైమ్‌కూడా అయిపోయింది. మళ్ళీ మనవాళ్ళంతా వచ్చేస్తారు."

స్వరాజ్యలక్ష్మి ముఖం. తెల్లగా పాలిపోయింది.

గంట గణగణమని మోగింది.

కోరంలేని సభను, వాయిదావేసి, విసుగ్గాలేచిన, సభాధ్యక్షుడిలా, స్వరాజ్యలక్ష్మి, అక్కడినుండి లేచి విసవిసా నడిచిపోయింది.